సాక్షి
పార్వతీపురం మన్యం
ఆదివారం । 28 । ఏప్రిల్ । 2024



సాగు సస్యశ్యామలం

ఏ శుభ ముహూర్తాన 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టారో అప్పటి నుంచి రాష్ట్రంలో సాగును సస్యశ్యామలం చేశారు. - 8లో



ఏజెన్సీలో పర్యాటక శోభ

అబ్బురపరిచే అందాలు, ఆహ్లాదాన్నిచ్చే కొండలు, వాటి మధ్య హొయలొలికించే జలపాతాలు, అక్కడే ఉండే వ్యూపాయింట్లు సీతంపేట ఏజెన్సీ సొంతం. - 8లో

ఐటీడీఏ అంబులెన్స్‌లో ప్రసవం

సీతంపేట: గురండి గ్రామానికి చెందిన గిరిజన మహిళ సవర ఎస్తేరు ఐటీడీఏ అంబులెన్స్‌లో శనివారం ప్రసవించింది. ఆమెకు పురిటినొప్పులు రావడంతో ఐటీడీఏ కాల్‌సెంటర్‌కు కుటుంబసభ్యులు ఫోన్ చేశారు. ఈ మేరకు అంబులెన్స్ సిబ్బంది గ్రామానికి వెళ్లి ఎస్తేరును తీసుకువస్తుండగా మార్గమధ్యంలో ప్రసవించింది. అనంతరం తల్లీబిడ్డలను అంబులెన్స్ సిబ్బంది మర్రిపాడు పీహెచ్‌సీలో చేర్పించారు.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభం



విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణ శిబిరం

బొబ్బిలి: పట్టణంలోని మాజీ సైనికుల సంక్షేమ సంఘం, గ్రీన్‌బెల్ట్ సొసైటీ, యూటీఎఫ్ సంయుక్తంగా పదో తరగతికి అప్‌గ్రేడ్ అవుతున్న విద్యార్థులకు వేసవి ఉచిత శిక్షణ తరగతులను శనివారం ప్రారంభించారు. స్థానిక వాసు జూనియర్‌కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓలు సీహెచ్ లక్ష్మణరావు, గొట్టాపు వాసు, నిర్వాహకులు కె.విజయగౌరి, వి.ఎస్.శర్మ, ఎస్వీ రమణమూర్తి విద్యార్థులకు పలు సూచనలిచ్చారు. చదుతోనే భవిత బంగారమవుతుందన్నారు. శిబిరంలో రౌతు వాసుదేవరావు, కిరణ్ కుమార్, ప్రసన్న కుమార్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

బొబ్బిలి: జిల్లా ఎన్నికల పరిశీలకుడు పర్వేజ్ ఇక్బాల్ రోహిల్లా బొబ్బిలి పట్టణంలోని 74, 75 పోలింగ్ కేంద్రాలను శనివారం పరిశీలించారు. గొల్లపల్లిలో ఉన్న పోస్టల్ బ్యాలెట్‌లను వినియోగించే పోలింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సలహాలు, సూచనలను ఆర్డీఓ ఎ.సాయిశ్రీ, సిబ్బందికి తెలియజేశారు.

ప్రశాంతంగా పాలిసెట్

విజయనగరం రూరల్: 2024 విద్యా సంవత్సరంలో పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పాలిసెట్–2024 ప్రశాంతంగా ముగిసింది. ప్రవేశ పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 8,907 మంది దరఖాస్తు చేసుకున్నారు. విజయనగరం, గజపతినగరం, బొబ్బిలిలోని 24 కేంద్రాల్లో నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 7,794 మంది హాజరు కాగా, 2,387 మంది గైర్హాజరయ్యారు.

- విజయనగరం జిల్లా కేంద్రంలోని 11 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 4,101 మంది హాజరు కాగా 419 మంది గైర్హాజరయ్యారు. వీరిలో బాలురు 2387 మంది, బాలికలు 1714 మంది పరీక్ష రాశారు.
- బొబ్బిలిలోని 7 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు 2002 మంది హాజరు కాగా 346 మంది గైర్హాజరయ్యారు. వీరిలో బాలురు 1279 మంది, బాలికలు 723 మంది పరీక్ష రాశారు.
- గజపతినగరంలోని 6 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించగా 1691 మంది హాజరయ్యారు. 559 మంది గైర్హాజరయ్యారు. వీరిలో బాలురు 939 మంది, బాలికలు 752 మంది పరీక్ష రాశారు. అత్యధికంగా విజయనగరంలో 90.7 శాతం హాజరు నమోదు కాగా బొబ్బిలిలో 85.2 శాతం, గజపతినగరంలో 82.9 శాతం హాజరు నమోదైంది. పరీక్షల ఏర్పాట్లను జిల్లా కన్వీనర్, విజయనగరం ఎంఆర్ఏజీఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి పర్యవేక్షించారు. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు మౌలిక సదుపాయాలు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

ఎన్నికల సిబ్బందికి విధుల కేటాయింపు



ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ చేసిన జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: వచ్చేనెల 13న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు నియోజకవర్గాల వారీగా సిబ్బంది కేటాయింపు ప్రక్రియ శనివారం పూర్తయ్యింది. కలెక్టర్ కార్యాలయంలోని నేషనల్ ఇన్ఫార్మేటిక్ సెంటర్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ ద్వారా జిల్లాలో 12,522 మంది ఎన్నికల సిబ్బందిని నియోజకవర్గాలకు కేటాయించే ప్రక్రియను కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, ఎన్నికల సాధారణ పరిశీలకులు హనిష్‌ఛాబ్రా, సీతారాం జాట్ తదితరుల సమక్షంలో ఎన్ఐసీ అధికారులు నిర్వహించారు. మహిళా ఉద్యోగులకు వారు పనిచేస్తున్న నియోజకవర్గ పరిధిలోని వేరొక మండలంలోను, పురుషులకు ఇతర నియోజకవర్గాల్లో ఎన్నికల విధుల్లో నియమించారు. పీఓ, ఏపీఓలను 2,087 చొప్పున, ఇతర పోలింగ్ సిబ్బంది 8,348 మందికి విధులు కేటాయించినట్లు కలెక్టర్ తెలిపారు. మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ వచ్చేనెల 11వ తేదీన జరుగుతుందన్నారు. జేసీ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ బి.సహదిత్ వెంకట్ త్రివినాగ్, డీఆర్వో ఎస్.డి.అనిత, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ ప్రభాకరరావు పాల్గొన్నారు.

జగన్..ఓ నమ్మకం

- గడపగడపనా సంక్షేమ వికాసం
- సంక్షేమ పథకాలతో మరింత మందికి లబ్ధి
- చిరు ఉద్యోగులకూ ఊరట
- వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోపై అన్ని వర్గాల్లో హర్షాతిరేకం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఏదైతే చెప్తారో తప్పకుండా చేస్తారన్న నమ్మకం రాష్ట్ర ప్రజల్లో బలంగా ఉంది. ఈ నేపథ్యంలో సార్వత్రిక ఎన్నికల వేళ ఇచ్చిన మాట తప్పకుండా పక్కాగా అమలు చేయగలిగే మేనిఫెస్టోను శనివారం ఆయన విడుదల చేశారు.



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రకటిస్తున్న మేనిఫెస్టోలోని అంశాలను ఆసక్తిగా వీక్షిస్తున్న ప్రజలు

సాక్షి, పార్వతీపురం మన్యం/గుమ్మలక్ష్మీపురం/పాలకొండ/సాలూరు రూరల్: చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా ఎన్నికల మేనిఫెస్టోను ఒక మత గ్రంథంగా భావించి..99 శాతం హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిది. ఇప్పుడు ఆ సంక్షేమ ఒరవడిని కొనసాగిస్తూ.. మరింత మందికి మేలు కలిగిస్తూ, 2024 ఎన్నికల మేనిఫెస్టోను తీసుకొచ్చారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న చిరు ఉద్యోగులకు ఊరట కలిగించేలా ప్రభుత్వ పథకాలపై నిర్ణయం తీసుకున్నారు. విద్య, వైద్యం, వ్యవసాయం, పారిశ్రామిక, సేవా రంగాలకు మేనిఫెస్టోలో అధిక ప్రాధాన్యం ఇచ్చారు. గడపగడపనా సంక్షేమ వికాసం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీనిపై అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

జగన్ చెబితే చేస్తాడు..



గత ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేసింది. ప్రతి వర్గానికీ మేలు చేసింది. అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేయడం, నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే నగదు జమ చేయడంవల్ల అవినీతి తగ్గింది. ఇప్పుడు మరోసారి సంక్షేమాన్నే జగన్‌మోహన్‌రెడ్డి నమ్ముకున్నారు. కొన్ని పథకాల పరిధిని పెంచడం గొప్ప నిర్ణయం. జగన్ చెబితే చేస్తాడు. చంద్రబాబులా మోసం చేయడు.

– ముప్వల సత్యంనాయుడు, పార్వతీపురం

అంతా మంచే జరుగుతుంది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రకటించిన 2024 ఎన్నికల మేనిఫెస్టో వల్ల బడుగు, బలహీన వర్గాలకు మంచి జరుగుతుంది. మహిళల ఆర్థిక స్వావలంబనకు వైఎ స్సార్ చేయూత, ఆసరా, కాపు నేస్తం, ఈబీసీ నేస్తం, సున్నా వడ్డీ రుణాలు, అమ్మ ఒడి, కల్యాణమస్తు–షాదీతోఫా వంటి పథకాలు, రైతుల సంక్షేమం కోసం రైతు భరోసా పథకం నగదు పెంపు, అవ్వాతాతలకు రూ.3,500 వరకు పింఛన్ పెంపు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా రూ. 25 లక్షల వరకు ఉచిత వైద్యం వంటి వరాలు బడుగులకు గొడుగులా ఉన్నాయి. ఇది నిజమైన మేనిఫెస్టో. చంద్రబాబులా ఎన్నికల్లో లబ్ధి కోసం ఇచ్చే మేనిఫెస్టో కాదు.

– కుంబురుక దీనమయ్య, ఎంపీపీ, గుమ్మలక్ష్మీపురం

అన్ని వర్గాలను ఆకట్టుకునేలా



గతంతో పోల్చుకుంటే నవరత్నాలను మరింత పదునుగా మేనిఫెస్టోలో పొందుపరిచారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి అన్ని వర్గాల అవసరాలను గుర్తించారు. ఈ క్రమంలోనే మేనిఫెస్టో రూపకల్పన జరిగిందని భావిస్తున్నాం. గత ఎన్నికల్లో ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను దాదాపు 99శాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కింది. ప్రస్తుత పథకాలు కూడా సమర్థవంతంగా అమలు చేయగలరన్న నమ్మకం మాకుంది.

మజ్జి నవీన్‌కుమార్, గ్రాడ్యుయేట్ విద్యార్థి, సీఎంపురం, పాలకొండ మండలం

మహిళా పక్షపాతి అనిపించుకున్నారు



గతంలోను, ప్రస్తుతం విడుదల చేసిన నవరత్నాల పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇచ్చారు. వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తే రాష్ట్రంతో పాటు ప్రతి కుటుంబం బాగుపడుతుందనేదే జగనన్న లక్ష్యంగా భావిస్తున్నాం. ఆయన మహిళా పక్షపాతి అని మరోమారు నిరూపించారు. సున్నా వడ్డీతో మహిళలకు రూ.3లక్షల వరకు రుణాలు ఇప్పిస్తామనడం ఎంతో బాగుంది.

– టేకి రామకృష్ణ, చేతివృత్తిదారు, పాలకొండ పట్టణం

పేదల పాలిట వరం



ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి శనివారం ప్రకటించిన మేనిఫెస్టో అద్భుతంగా ఉంది. అమలు చేయబోయే పథకాలు పేదల పాలిట వరం. బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ప్రస్తుతం అమలుచేస్తున్న పథకాలలో కొన్నింటిని రెట్టింపు చేశారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మాయమాటలు చెప్పి సిగ్గులేకుండా ఎదుటి పార్టీ వారి మేనిఫెస్టోను కాపీ కొట్టడం ప్రజలు గమనిస్తున్నారు. జగనన్నకు మోసగించడం రాదు. పేదప్రజల సంక్షేమమే లక్ష్యంగా మేనిఫెస్టో విడుదల చేశారు. ఇప్పటికే గత సంక్షేమ పథకాలతో ఆనందంగా ఉన్న ప్రజలకు మరింత ఆనందాన్ని పంచిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసి తీరాల్సిందే.

–రెడ్డి పద్మజ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్



మహిళలకు తోడుగా..



వైఎస్సార్ చేయూత పథకం కొనసాగించడం వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. జగనన్న అమ్మఒడి సాయం రూ.17,000లకు పెంపు, సున్నా వడ్డీ రుణాలు, వివిధ సంక్షేమ పథకాలు మహిళలకు తోడుగా నిలవనున్నాయి. జగనన్న చెబితే చేస్తాడు. వచ్చే ఐదేళ్లు స్వర్ణయుగమే. ఆయన అధికారంలోకి వస్తే అన్నిరంగాలు అభివృద్ధి చెందుతాయి.

– మండంగి రాధిక, జెడ్పీటీసీ, గుమ్మలక్ష్మీపురం

ఎండ ప్రచండం



- పెరిగిన వడగాడ్పులు
- అవస్థలు పడుతున్న చిన్నారులు, వృద్ధులు



పాలకొండ పట్టణంలో నిర్మానుష్యంగా రహదారి

పార్వతీపురం: ఉష్ణోగ్రతలు రోజు రోజుకు అధికమవుతున్నాయి. ఉదయం 10 గంటలనుంచి ఎండలు, వడగాడ్పుల తీవ్రత సాయంత్రం వరకు కొనసాగుతోంది. రాత్రి 7 గంటల ప్రాంతంలో కూడా వడగాడ్పులు ఉండడం గమనార్హం. రానున్న రోజుల్లో ఎండలు, వడగాడ్పులు తీవ్రత మరింత పెరిగే ఆస్కారం ఉన్నట్లు విపత్తుల నిర్వాహణాధికారులు పేర్కొంటున్నారు. వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. జిల్లాలో శనివారం సాలూరులో అత్యధికంగా 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో వృద్ధులు, చిన్నారుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

మండలం	ఉష్ణోగ్రత డిగ్రీలు
బలిజిపేట	43.7
భామిని	43.7
గరుగుబిల్లి	44.7
గుమ్మలక్ష్మీపురం	42.0
జియ్యమ్మవలస	43.7
కొమరాడ	44.0
కురుపాం	42.0
మక్కువ	43.5
పాచిపెంట	43.5
పాలకొండ	43.7
పార్వతీపురం	43.2
సీతంపేట	44.1
సీతానగరం	44.7
వీరఘట్టం	43.7
సాలూరు	45.2

అందరివాడు జగనన్న



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు, సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థి పీడిక రాజన్నదొర

- అబద్ధాలు, మోసాలే టీడీపీ అజెండా
- సాలూరు నియోజకవర్గంలో కోట్లాది రుపాయలతో అభివృద్ధి
- వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు

సాలూరు:

ప్రజలకు మంచి చేసింది జగన్‌మోహన్‌రెడ్డి అని, ఆయన అందరి ప్రజల మనస్సులను దోచుకున్నారని జెడ్పీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ డిప్యూటీ రీజనల్ కో ఆర్డినేటర్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన సాలూరు పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ, జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసిన నవరత్నాల వల్ల రాష్ట్రం దివాలా తీస్తుందని విమర్శించిన చంద్రబాబు నేడు సూపర్‌సిక్స్ పథకాలంటున్నారని వాటి అమలుకు చాలా ఖర్చవుతుందన్నారు. ప్రజలను మోసం చేసింది ప్రతిపక్ష నేత చంద్రబాబు అని ఆచరణ సాధ్యం కాని హామీలను ఇచ్చి ప్రజలను మరోసారి మోసం చేయడానికి టీడీపీ కూటమి ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. అబద్ధాలు, మోసపూరిత మాటలే చంద్రబాబు 14 ఏళ్ల పాలన అని విమర్శించారు. గత పాలనలో ప్రజలకు చేసిన మంచిని టీడీపీ చెప్పలేకపోతుందని ఎద్దేవా చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల అజెండా జగన్‌మోహన్‌రెడ్డిపై అబద్ధాల దాడిచేయడమేనని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థను అనేక రకాలుగా విమర్శించిన చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు నేడు మళ్లీ యూటర్న్ తీసుకుని, రెండు నాల్కల ధోరణి అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సుమారు 65 లక్షల మంది పింఛన్ దారుల తిరగబడతారని భావించే నేడు వలంటీర్లపై చంద్రబాబు ప్రేమకురిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ కూటమిని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని స్పష్టం చేశారు. ప్రజలకు మంచి చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను ఆశీర్వదించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ధీమా వెలిబుచ్చారు. 2019 ఎన్నికల ఫలితాలే మళ్లీ పునరావృతం కానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. సాలూరు నియోజకవర్గం అభివృద్ధి కోసం రాజన్నదొర చేసిన కృషి అనిర్వచనీయమని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో మాట్లాడి గిరిశిఖర గ్రామాలకు రోడ్లు, వంతెనలు, వందపడకల ఆస్పత్రి, సాగునీటి ప్రాజెక్టుల ఆధునికీకరణ తదితర కోట్లాది రుపాయలతో అభివృద్ధి పనులు చేయించారని వివరించారు. ప్రజలకు మంచి చేయడమే అజెండాగా పనిచేస్తున్న రాజన్నదొరను, అరకు ఎంపీ అభ్యర్థిని తనూజారాణిలను గెలిపించాలని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా సమన్వయంతో పనిచేసి వైఎస్సార్‌సీపీకి అఖండ మెజారిటీ అందించాలని విజ్ఞప్తి చేశారు.

మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సాలూరు అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర పిలుపునిచ్చారు. మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతిహామీని జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తారని, ఇప్పటికే ఇది రుజువైందన్నారు. ఎన్నికల వేళ టీడీపీ కూటమి ప్రజలను మరోసారి మోసం చేయడానికి అబద్ధపు మాటలు, హామీలతో వస్తోందన్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ సమష్టిగా, సమన్వయంతో పనిచేసి కూటమి అబద్ధపు హామీలు, మాటలను ఎండగడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రజాసంక్షేమం, అభివృద్ధి పాలనను వివరిస్తూ ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆయురారోగ్య ప్రాప్తిరస్తు

- విద్యార్థులకు ఆరోగ్యభాగ్యం
- ప్రభుత్వ పాఠశాలల్లో క్రమం తప్పకుండా హెల్త్ డ్రైవ్
- ప్రత్యేక యాప్‌లో ఆరోగ్య వివరాల నమోదు
- జిల్లాలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వైద్యశిబిరాలు
- 3,90,507 మంది విద్యార్థులకు స్క్రీనింగ్

పార్వతీపురంటౌన్:

విద్యార్థులకు ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్న జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించింది. విద్యార్థులను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమం చేపట్టింది. ప్రతి పాఠశాలకు వైద్య సిబ్బందిని పంపించింది. విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేసి వారి ఆరోగ్య వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన పాఠశాలల హెల్త్ యాప్‌లో నమోదు చేయించింది. వ్యాధులతో బాధపడేవారికి ఉచిత వైద్యసేవలతో ఆరోగ్య భద్రత కల్పించింది. ఈ కార్యక్రమంలో భాగంగా గత నాలుగేళ్లుగా పార్వతీపురం మన్యం జిల్లాలో 397 మంది ఏఎన్ఎంలు పాఠశాలల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. 1698 పాఠశాలల్లోని 3,90,507 మంది విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షించారు. ఆయా వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ప్రతి ఏడాది 15 రోజుల పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఈ హెల్త్ డ్రైవ్ నిర్వహించారు.

పిల్లల ఆరోగ్యమే లక్ష్యంగా..

జిల్లాలో ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల్లో 40 శాతం గిరిజన గ్రామాలకు చెందిన వారు. వారిలో సికెల్‌సెల్ ఎనీమియా, రక్తహీనతతో బాధపడుతున్న వారికి ఏఎన్ఎంలు పరీక్షలు నిర్వహించారు. వ్యాధుల గుర్తింపు, వైద్యపరీక్షలపై ఏఎన్ఎంలకు జిల్లా వైద్యాధికారులు శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల ఎత్తు, బరువు వంటి వివరాలు సేకరించడంతో పాటు రక్త హీనతను గుర్తించేందుకు హిమోగ్లోబిన్ పరీక్ష చేశారు. సికిల్‌సెల్ ఎనీమియా సమస్య ఉన్న విద్యార్థులను గుర్తించి నివారణకు పూర్తి చర్యలు చేపట్టారు. రక్తహీనతను గుర్తించి విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ ఔషధాలను వైద్యశాఖ సరఫరా చేసింది. వైద్యపరీక్షల్లో ఆరోగ్య సమస్యలున్నట్టు గుర్తించిన విద్యార్థులకు పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందించారు.

పాఠశాలల పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ..

విద్యార్థుల ఆరోగ్య వివరాలతో పాటు పాఠశాలల పరిశుభ్రత, మధ్యాహ్న భోజనం అమలు తీరు, తాగునీటి వసతులు తదితర వివరాలను హెల్త్ యాప్‌లో నమోదు చేశారు. కౌమార బాలికల పరిశుభ్రతలో భాగంగా ప్రభుత్వం నేప్‌కిన్లను పంపిణీ చేసింది.



దోకిశీల పాఠశాలలో స్కూల్‌హెల్త్ కార్యక్రమంలో పాల్గొన్న వైద్యసిబ్బంది (ఫైల్)

గతంలో పాఠశాకు పంపాలంటే భయం



గతంలో మా అబ్బాయి యశ్వంత్‌ను పాఠశాలకు పంపాలంటే భయంగా ఉండేది. పాఠశాలలో సరైన భోజనం ఉండేది కాదు. ఎప్పటికప్పుడు ఆరోగ్య సమస్యలు వచ్చేవి. జగనన్న ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. విద్యావ్యవస్థలో పూర్తిగా మార్పులు తీసుకువచ్చారు. ఆరోగ్యవంతమైన మధ్యాహ్న భోజనం, క్లాస్ రూమ్‌లో పరిశుభ్రత కూడిన ఆహ్లాదకర వాతావరణం ఏర్పాటు చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఏటా పాఠశాలలోనే ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నారు.

– శ్రీదేవి, విద్యార్థి తల్లి, పార్వతీపురం



బాలగుడబ పాఠశాలలో స్కూల్‌హెల్త్ కార్యక్రమం

విద్యా సంవత్సరం	హెల్త్ స్క్రీనింగ్ చేసిన విద్యార్థులు
2020–21	96,149
2021–22	98,120
2022–23	99,110
2023–24	97,128

విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకునేందుకే..



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పాఠశాలల్లోనే పరీక్షించి, వారిని ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం. చిన్నవయసులోనే ఆరోగ్య సమస్యలను నివారించవచ్చు. ప్రతి విద్యార్థి ఆరోగ్య వివరాలను యాప్‌లో నమోదు చేశారు. ఆరోగ్యకర చదువులకు ఇది దోహదపడుతుంది. రక్తహీనతతో బాధపడుతున్న పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్నారు.

– యాండ్రాపు మంగ, పేరెంట్స్ కమిటీ చైర్మన్, లక్ష్మీనారాయణపురం

పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



గతంలో పాఠశాలల్లో కనీస వసతులు ఉండేవి కావు. విద్యార్థులను పట్టించుకున్న దాఖలాలు లేవు. 2019 జగనన్న అధికారంలోకి వచ్చిన తరువాత విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. అంతే కాకుండా ఏటా క్రమం తప్పకుండా మా పాప గాయత్రి చదువుతున్న మున్సిపల్ ఎలిమెంటరీ పాఠశాలలో ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన మాత్రలు అందజేశారు.

– గంగ, విద్యార్థిని తల్లి, పార్వతీపురం

జిల్లాలో స్కూల్ హెల్త్ డ్రైవ్ వివరాలు..

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు	1698
హెల్త్ డ్రైవ్‌లో పాల్గొన్న ఏఎన్ఎంలు	397 మంది
వైద్యులు	80 మంది

క్లుప్తంగా

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

పార్వతీపురం టౌన్: గుంటూరు–రాయగడ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి జారిపడిన ఒడిశాలోని రాయగడకు చెందిన యువకుడు సాయిగౌతమ్(25) పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ వద్ద శనివారం మృతి చెందాడు. మృతుడి దగ్గర లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబసభ్యులకు సమాచారం అందజేశామని జీఆర్పీ హెచ్‌సీ రత్న కుమార్ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించామని చెప్పారు.

30 లీటర్ల సారా పట్టివేత

పాచిపెంట: మండలంలోని వేటగానివలస గ్రామంలో సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకున్నామని ఎస్సై నారాయణరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన మాట్లాడుతూ, సారా తరలిస్తూ పట్టుబడిన వ్యక్తి నుంచి 30 లీటర్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి, నిందితుడిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

విద్యార్థిని ఆత్మహత్య

- మార్కులు తక్కువగా వచ్చాయని మనస్తాపం

పాలకొండ రూరల్: ఇటీవల విడుదలైన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మార్కులు తక్కువగా వచ్చాయని మనస్తాపం చెందిన ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. పదో తరగతి ఫలితాల్లో ఆశించిన మార్కులు రాకపోవడంతో పాలకొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(15) కొద్ది రోజులుగా ముభావంగా ఉంటోంది. ఈ క్రమంలో శనివారం తల్లిదండ్రులు ఉపాధి పనులకు, సోదరుడు ఆటలు ఆడుకునేందుకు వెళ్లిపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుంది. సాయంత్రం ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు గుర్తించి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

వేసవిలో జాగ్రత్త

- ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథ రావు



పార్వతీపురంటౌన్: ఆరోగ్యమే మహాభాగ్యమని, వేసవిలో వడదెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బగాది.జగన్నాథ రావు అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఆరోగ్య కార్యాలయం నుంచి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వేసవికాలంలో తలకు టోపీలు, కళ్లద్దాలు ధరించాలన్నారు. బయటకు వెళ్లేటప్పుడు వాటర్ బాటిల్, గ్లూకోజ్ వంటివి వెంట ఉంచుకోవాలని సూచించారు. మనిషి ఆరోగ్యస్థితి చాలావరకు స్వయంగా తానే తెలుసుకోవచ్చని, ఏ చిన్న ఆరోగ్య సమస్య తలెత్తినా వాటి లక్షణాలు ప్రస్ఫుటమవుతాయని, జాప్యం చేయకుండా వెంటనే అందుబాటులో ఉన్న వైద్యసిబ్బందిని సంప్రదించి ఆరోగ్య కేంద్రాలు, ఆస్పత్రుల్లో వైద్యపరీక్షలు చేయించుకోవాలని ఇలా ప్రారంభంలోనే చికిత్స పొందడం వల్ల వ్యాధి తీవ్రత చెందకుండా ఉంటుందన్నారు. బిడ్డ పుట్టినప్పటి నుంచి వేయాల్సిన అన్ని టీకాలు వేయించడం, ఎదుగుదల క్రమంలో పోషకాహార లోపం లేకుండా చూసుకోవడం అత్యవసరమన్నారు. కౌమార, యవ్వన దశల్లో రక్తహీనతకు గురవకుండా చూసుకోవాలన్నారు. మధ్యవయస్కుల నుంచి దీర్ఘకాలిక రోగాలు తలెత్తే అవకాశాలు ఉన్నందున క్రమబద్ధీకరమైన ఆహారపు అలవాట్లు, జీవన శైలి ఉండాలని ఎప్పటికప్పుడు ఆరోగ్య తనిఖీలు చేయించుకుని, వైద్యుల సూచనలు, సలహాలు పాటించా లని చెప్పారు. వృద్ధాప్యానికి చేరువయ్యే కొద్దీ జీర్ణవ్యవస్థపై ఒత్తిడి లేకుండా ఆహార నియమాలు ఉండాలన్నారు. టెక్నాలజీతో కూడిన జీవన విధానం, మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఆరోగ్య సమస్యలు ప్రారంభంలోనే గుర్తిస్తే కొద్దికాల వ్యవధిలోనే నయం చేయవచ్చని పేర్కొన్నారు.

లక్షా 40వేలు పట్టివేత

విజయనగరం క్రైమ్: చిల్లపేట నుంచి వస్తున్న శ్రీనివాస్ అనే వ్యక్తి ఆధారాల్లేకుండా లక్షా 40వేలు నగదును పట్టుకెళ్తుండగా విజయనగరంలోని అయ్యకోనేరు సమీపంలో స్పెషల్ ఫ్లయింగ్ స్క్వాడ్ పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఆధారాలు లేకపోవడంతో నగదును సీజ్ చేశామని, జిల్లా గ్రీవెన్స్ కమిటీ వద్ద పెడతామని టూటౌన్ సీఐ కోరాడ రామారావు తెలిపారు.

సాగు సస్యశ్యామలం



- పెరిగిన పంటల దిగుబడి
- వైఎస్సార్‌సీపీ పాలనలో సంతోషంలో రైతులు

వీరఘట్టం: ఏ శుభ ముహూర్తాన 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టారో అప్పటి నుంచి రాష్ట్రంలో సాగును సస్యశ్యామలం చేశారు. సాగు చేసే రైతులు ఊరు కదలకుండా గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి వారికి కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు పంటల సాగుకు కావాల్సినవన్నీ దరికి చేర్చడంతో రైతులు ఎంతో ఉత్సాహంతో సాగుచేశారు. అలాగే పంట కాల్వల ద్వారా సకాలంలో సాగునీటిని పంపిణీ చేయడంతో శివారు ప్రాంతాల్లో కూడా పంటలు బాగా పండి ఆశించిన దిగుబడులు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైతులు సాగు చేసి పండించిన పంటలను కళ్లాల వద్దే కొనుగోలు చేసి గరిష్ఠ మద్దతు ధర ఇప్పించడంతో గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యవసాయం పండగలా మారింది. రైతే రాజని నమ్మిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు రైతాంగం సిద్ధమవుతున్నారు.

టీడీపీ పాలనలో అంతా కరువే

గత టీడీపీ పాలనలో రాష్ట్రంలో తీవ్రకరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. వాటిని అధిగమించే ప్రయత్నం చేయకుండా రైతుల పేరిట వచ్చిన పంట నష్టపరిహారాలను కూడా టీడీపీ నాయకులు అడ్డుగోలుగా బొక్కేశారు. ఇలా 2014–19 మధ్యకాలంలో ముఖ్యంగా పార్వతీపురం మన్యం జిల్లాలోని తోటపల్లి ఆయకట్టు రైతులు తీవ్ర కరువు పరిస్థితులను అనుభవించారు. 2014లో టీడీపీ అధికారం చేపట్టిన ఏడాదే అక్టోబర్ 8 నుంచి 14 వరకు హుద్‌హుద్ తుఫాన్ విలయ తాండవం చేసి వరిపంటకు తీవ్రనష్టాన్ని మిగిల్చింది. తుఫాన్‌లో పంటలు నష్టపోయిన నిజమైన రైతులను విస్మరించి టీడీపీ నాయకులు తమ బినామీల పేర్లు నమోదుచేసి పంటల పరిహారాన్ని స్వాహా చేశారు. అలాగే 2015లో నవంబర్‌లో చావ్లా తుఫాన్ ప్రభావంతో పంటలకు నష్టం కలిగింది. మరుసటి ఏడాది 2016 ఆగస్టు 18న తోటపల్లి ఎడమకాలువలో పెద్దబుడ్డిడి వద్ద ఉన్న బ్రిటిష్ కట్టడం సైఫన్‌కు భారీగా గండిపడింది. దీంతో సైఫన్‌కు దిగువన ఉన్న 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు ప్రశ్నార్థకంగా మారడంతో తీవ్రంగా నష్టపోయారు. అలాగే 2017 ఖరీఫ్‌లో ఫణి తుఫాన్ పంటలను అతలాకుతం చేసింది. 2018లో అక్టోబర్ 8 నుండి 12 వరకు సంభవించిన తిత్లీ తుఫాన్ దాటికి పంటలు సమూలంగా నేలమట్టమయ్యాయి. ఇలా 2014 నుంచి 2018 వరకు చంద్రబాబు పాలనలో రాష్ట్రవ్యాప్తంగా కరువు ఏర్పడడంతో తోటపల్లి పాత ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోయారు. గత పాలనలో విసిగిన రైతులు 2019లో టీడీపీకి బుద్ధి చెప్పి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టారు.

గతంలో విత్తనాల కోసం నానా యాతన



టీడీపీ పాలనలో విత్తనాల కోసం నానా యాతన పడేవాళ్లం. నేను నాలుగు ఎకరాల్లో సాగు చేస్తున్నాను. ఎనిమిది బస్తాల విత్తనాలు అవసరమయ్యేవి.ఆ విత్తనాల కోసం మార్కెట్ యార్డ్ దగ్గర రోజుల తరబడి పడిగాపులు కాసేవాళ్లం. 2019లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతులకు కావాల్సిన విత్తనాల నుంచి ఎరువుల వరకు అన్ని పంటల సాగుకు ముందే ఆర్‌బీకేల ద్వారా ఇంటి వద్దకే వస్తున్నాయి. అంతేకాకుండా పంటల పెట్టుబడికి రైతు భరోసా ద్వారా డబ్బులు కూడా ఇవ్వడంతో ఐదేళ్లుగా పంటలు పండించేందుకు ఎటువంటి ఇబ్బందులు లేవు.

కిల్లారి శ్రీను, రైతు, వీరఘట్టం

రవాణా చార్జీలు కూడా ఇచ్చారు



గత టీడీపీ పాలనలో పంటలు సాగు చేయడానికి ఎంతో ఇబ్బందులు పడేవాళ్లం. పండిన పంటను ఎప్పుడు కొంటారో తెలిసేది కాదు.చివరకు తక్కువ ధరకు వ్యాపారులకు అమ్ముకునేవాళ్లం.కనీసం పెట్టుబడి కూడా వచ్చేది కాదు. అయితే జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రైతులు పండించిన పంటలకు మంచి గిట్టుబాటు ధర ఇచ్చారు.అంతేకాక మిల్లులకు రైతులు నేరుగా ధాన్యం తరలిస్తే ట్రావెలింగ్ డబ్బులు కూడా ఇచ్చారు. ఈ ఏడాది నాకు ట్రావెలింగ్ డబ్బులు రూ.41 వేలు వచ్చాయి. రైతులకు ఇంత మేలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డికే మా మద్దతు ఇస్తాం.

ఆబోతుల సంగంనాయుడు, రైతు, కంబర, వీరఘట్టం మండలం

ఎండ తీవ్రతను తోసిరాజని..

- ప్రచారంలో దూసుకుపోతున్న అభ్యర్థులు

సార్వత్రిక ఎన్నికల సమరానికి సమయం దగ్గర పడుతుండడంతో ఎమ్మెల్యే అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎండ తీవ్రతను సైతం లెక్కచేయకుండా ఓటరు దేవుళ్ల కరుణ కోసం గ్రామాలకు వెళ్తూ తమను గెలిపించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరుతున్నారు.

ప్రచార పర్వం



భామిని: దిమ్మిడిజోలలో ఇంటింటి ప్రచారంలో పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి



కొమరాడ: కెమిశీలలో ప్రచారం చేస్తున్న కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి



సాలూరు: పట్టణంలోని 6వ వార్డులో ఎన్నికల ప్రచారంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పీడిక రాజన్నదొర



పార్వతీపురంటౌన్: పట్టణంలోని 17వ వార్డులో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ఏజెన్సీలో పర్యాటక శోభ

- ఐదేళ్లలో టూరిజం అభివృద్ధి
- ఆకట్టుకుంటున్న ఆడలి వ్యూపాయింట్
- అందంగా అడ్వెంచర్ పార్కు
- ఆహ్లాద పరుస్తున్న మెట్టుగూడ జలపాతం
- నిర్మాణంలో గిరిజన మ్యూజియం



జలవిహార్‌లో బోటుషికారు



జగతపల్లి వ్యూ పాయింట్



శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం



మెట్టుగూడ జలపాతం



ఆడలి వ్యూపాయింట్

సీతంపేట: అబ్బురపరిచే అందాలు, ఆహ్లాదాన్నిచ్చే కొండలు, వాటి మధ్య హొయలొలికించే జలపాతాలు, అక్కడే ఉండే వ్యూపాయింట్లు సీతంపేట ఏజెన్సీ సొంతం. ముఖ్యంగా సీతంపేట ఏజెన్సీ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏజెన్సీలో టూరిజాన్ని బాగా అభివృద్ధి చేయాలని ఇక్కడ పర్యాటకానికి అనువైన ప్రదేశాలున్నాయని స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పర్యాటకానికి నిధులు వెచ్చించారు. రూ.2 కోట్లతో సీతంపేటలో గిరిజన మ్యూజియం నిర్మాణంలో ఉంది. ఆదిమానవుడి నుంచి నేటి వరకు గిరిజనులు ఎలా అభివృద్ధి సాధించారు, వారి ఆచార, సంప్రదాయలు, పండగలు, ప్రపంచ దేశాల ఆదిమ తెగల బొమ్మలు ఆకట్టుకునేలా తీర్చిదిద్దుతున్నారు. రూ.కోటితో శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు.

ఆకట్టుకుంటున్న ఆడలి వ్యూపాయింట్

సుమారు రూ.కోటి వ్యయంతో ఆడలి వ్యూపాయింట్ నిర్మించారు. ఈ వ్యూపాయింట్ నుంచి చూస్తే హిరమండలం వంశధార ప్రాజెక్టుతో పాటు ఆ ప్రాంతమంతా చూడముచ్చటగా కనిపిస్తుంది. జగతల్లి హిల్ రిసార్ట్ పనులు జరుగుతున్నాయి. దీనికి కూడా రూ. కోటికి పైగా నిధులు వెచ్చించారు. మెట్టుగూడ జలపాతానికి దాదాపు రూ.50 లక్షలు వెచ్చించి అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. పర్యాటకుల కోసం పగోడాలు, ఉండడానికి వీలుగా ఒక భవనం, ఇతర సౌకర్యాలన్నీ ఏర్పాటు చేశారు. సందర్శకుల తాకిడి కూడా ఇక్కడికి ఎక్కువే. అలాగే సున్నపుగెడ్డ, మల్లి, కొండాడ వంటి ఎన్నో జలపాతాలు కనువిందు చేస్తాయి. ఇవి ఇంకా అభివృద్ధి కావాల్సి ఉంది. ఇక జగతపల్లి వద్ద వ్యూపాయింట్ కూడా చూడదగినదే. ఇక్కడ రిసార్ట్స్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు. ఆడలి వ్యూపాయింట్ అభివృద్ధి చేస్తున్నారు. సీతంపేటలో ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కును సుందరంగా తీర్చిదిద్దారు. దీనిలో భాగంగా జలవిహార్‌లో బోటు షికారు, ఆల్‌టర్న్ వెహికల్ వంటివి ఏర్పాటు చేశారు. వచ్చిన పర్యాటకులు వివిధ సాహస క్రీడల్లో పాల్గొనడానికి జెయింట్‌వీల్, హ్యాంగింగ్ బ్రిడ్జి, జలవిహార్‌లో బోటుషికారు వంటివి ఉన్నాయి. ఇక్కడ నిర్మించిన 5డీ థియేటర్ అడ్వెంచర్ సినిమాలతో పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటుంది. కార్తీక మాసంలో ఈ ప్రదేశాలకు ఎక్కువగా డిమాండ్ ఉంది.

నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు

టూరిజం అభివృద్ధి చెందడంతో స్థానికంగా ఉన్న గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. సుమారు 100 మందికి పైగా నిరుద్యోగులు ఆయా పర్యాటక ప్రదేశాల్లో ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఇతర ప్రదేశాలకు వలస వెళ్లకుండా ఇక్కడే ఉపాధి లభించడంతో తమకు ఎంతో ఆనందంగా ఉందని పలువురు నిరుద్యోగులు చెబుతున్నారు.



జియ్యమ్మవలస: వైఎస్సార్‌సీపీలోకి చేరిన వారికి కండువాలు వేసిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్‌రాజు

బాబూ నీకో దండం..!



పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన గౌరీపురం టీడీపీ కుటుంబాలు

- వైఎస్సార్‌సీపీలో చేరిన 100 టీడీపీ కుటుంబాలు
- ఆహ్వానించిన ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, పరీక్షిత్ రాజు

జియ్యమ్మవలస: కొమరాడ మండలంలోని నయా పంచాయతీ సంభేసు, లొద్ద, గుడ్డం గిరిజన గ్రామాలకు చెందిన 100 కుటుంబాల వారు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, వైఎస్సార్‌సీపీ మన్యం జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజుల సమక్షంలో చినమేరంగిలోని ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు మెచ్చి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు వారంతా ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో కొమరాడ వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దననాయుడు, యువత పాల్గొన్నారు.

పెదబొండపల్లిలో 100 టీడీపీ కుటుంబాలు

పార్వతీపురం టౌన్: మండలంలోని పెద్దబొండపల్లి గ్రామానికి చెందిన 100టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ పార్వతీపురం ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో శనివారం చేరాయి. పార్టీలో చేరిన వారిలో గంట రామకృష్ణ, జక్కు తురుపతినాయుడు యేగిరెడ్డి శ్రీనివాసరావు, అల్లు నాగభూషణ, గురాల భూషణ, ఎల్ సింహాచలంతో పాటు 100 మంది కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అభ్యర్థి అలజంగి జోగారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ సవరావు, తవుడమ్మ, చందాన శివాజీ ఇతర నాయకులు పాల్గొన్నారు.

గౌరీపురంలో 30 కుటుంబాలు

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, పార్వతీపురం నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి చూసి ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరుతున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని పెద్దింపేట పంచాయతీ గౌరీపురం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ అభిమానులు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావును శనివారం కలిసి ఆయన సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ప్రధానంగా జోగి అప్పలనాయుడు, జోగి కృష్ణ, జోగి చిన్నం నాయుడు, జోగి సత్యం నాయుడు, పెద్దిపురపు రాజు, జడ్డు కుర్మినాయుడు, పాడి సూరందొరలతో పాటు వారికి చెందిన 30 కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలజంగి జయప్రకాశ్, ఎంపీటీసీ మొదిల సాంబమూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాలవలస మురళీకృష్ణ, జెడ్పీటీసీ అలజంగి రవికుమార్, సర్పంచ్ కురిటి మోహనరావు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అలాగే పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో 17వ వార్డుకు చెందిన యువనాయకుడు తెర్లి బాలాజీతో పాటు వారి కుటుంబసభ్యులు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు.



వీరఘట్టం:ఏగిరెడ్డి సీతంనాయుడికి వైఎస్సార్‌సీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్



పార్వతీపురం టౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కుటుంబాలు



పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీలో చేరిన యువ నాయకుడు తెర్లి బాలాజీ

వీరఘట్టంలో 100మంది చేరిక

వీరఘట్టం: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ పాలకొండ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వాసరాయి కళావతి గెలుపే మన లక్ష్యం కావాలని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం వీరఘట్టం మండలంలోని నడిమికెల్ల గ్రామానికి చెందిన ఏగిరెడ్డి సీతంనాయుడు, నల్ల లక్ష్మునాయుడు, ముచ్చి రాములు, అల్లు సింహాచలం, పిన్నింటి సంగం తదితర 100 మంది టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ కండువాలు వేసి ఎమ్మెల్సీ విక్రాంత్ పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, సర్పంచ్ డోకల సుజాత, యాండ్రాపు లక్ష్మునాయుడు, డోకల శ్రీను, రొంగలి స్వామినాయుడు,గంట రామకృష్ణ, వాసిరెడ్డి అప్పలనాయుడు, ఓంప్రంగా మన్మథరావు, ముద్ద దేసి, సిరిపోతు మహేష్, రంభ శ్రీనివాసరావు, వైశ్యరాజు గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.